క్లుప్తంగా

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి అజేష్‌కుమార్

నిర్మల్‌టౌన్: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి అజేష్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్ పీహెచ్‌సీలో శనివారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన అవసరమని పేర్కొన్నారు. సైబర్ చట్టాలు, యాసిడ్ దాడులు, బాల్య వివాహాలు, గృహహింస చట్టం, ట్రైబల్ రైట్స్ సంబంధించిన న్యాయ సేవలపై అవగాహన ఉండాలన్నారు. బాలికల చట్టాలను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. నిర్మల్ చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ రాజలింగం, న్యాయవాదులు లింగాగౌడ్, మధుకర్, డాక్టర్ నైనారెడ్డి, డాక్టర్ మనిషా తదితరులు పాల్గొన్నారు.

బోరుబావికి విద్యుత్ మోటార్ బిగింపు



సాక్షి స్పందన

కుంటాల: మండలంలోని మెదన్‌పూర్ ఎస్సీ కాలనీలో బోరుబావికి మోటారు బిగించకపోవడంతో కాలనీవాసులు పడుతున్న తిప్పలపై ఈనెల 2న 'ప్ర'జల'పాట్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు బోరుబావికి మోటారును బిగించి తాగునీటి సమస్య తీర్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి, ఎంపీడీవో అబ్దుల్ రహీం, పంచాయతీ కార్యదర్శి దేవన్నలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

మైనార్టీ ఎన్నికల అబ్జర్వర్‌గా షబ్బీర్‌పాషా



షబ్బీర్‌పాషా

ఖానాపూర్: కాంగ్రెస్ ఖానాపూర్ నియోజకవర్గ మైనార్టీ ఎన్నికల అబ్జర్వర్‌గా షబ్బీర్ పాషా నియమిస్తూ ఏఐసీసీ మైనార్టీ సెల్ చైర్మన్ ఇమ్రాన్ గరీ, వైస్‌చైర్మన్ ఫర్హాన్ అజ్మీ ఉత్తర్వులు జారీచేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన అధిష్టానానికి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, నియోజకవర్గ సమన్వయ కర్త సత్తు మల్లేశ్, ఆదిలాబాద్ పార్లమెంట్ మైనార్టీ సెల్ ఇన్‌చార్జి జునైద్ మెమైన్, పార్లమెంట్ కో ఇన్‌చార్జి ఎంఏ లతీఫ్‌లకు షబ్బీర్‌పాషా కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ ముధోల్ అసెంబ్లీ కన్వీనర్‌గా నర్సన్న

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన సంగెమ్ నర్సన్నను ముధోల్ అసెంబ్లీ కన్వీనర్‌గా ఎన్నుకున్నట్లు మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావుపటేల్, విఠల్ రెడ్డి తెలిపారు. పార్టీ అధిష్టానానికి నర్సన్న ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. కుంటాలలో పారిశుధ్య పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలో మొక్కలను సంరక్షించాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించి సంతృప్తి చేశారు. ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఏపీవో గట్టుపల్లి నవీన్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, దిలీప్ ఉన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ముధోల్: మండల కేంద్రంలోని రబీంద్ర పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ చదువుని పూర్తి చేసి పై తరగతులకు వెళ్లే విద్యార్థులకు ప్రశంసపత్రాలను అందజేశారు. ప్రతిభను కనబరుస్తున్న విద్యార్థులను అభినందించారు.

నేటి నుంచి శ్రీరామదీక్షలు

- శ్రీరామనవమి సందర్భంగా స్వీకరణ
- పూజలు చేయనున్న గ్రామస్తులు
- కామోల్‌లో ఉత్సవాలకు ఏర్పాట్లు



కామోల్ గ్రామంలోని రామమందిరం

భైంసారూరల్: మరో భద్రాద్రి రాముడిగా పూజలు అందుకుంటున్న కామోల్ శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉత్సవాల కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం నుంచే గ్రామస్తులు దీక్షలు స్వీకరించనున్నారు. ప్రతిఏటా రామదీక్షలు స్వీకరించి పూజలు చేస్తుంటారు. ఈ ప్రాంతంలో సీతారామచంద్రస్వామిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు కామోల్ గ్రామానికి వెళ్తుంటారు.

300 ఏళ్లుగా..

సుమారు 300 ఏళ్లుగా కామోల్ గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాలు కొనసాగుతూ వస్తున్నాయి. గతంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు సంభాజీ మహారాజ్ దయారాం రాజారాం దేశ్‌పాండేలకు తమ రాజ్యంలోని కామోల్ గ్రామం జాగిరీదారుగా ప్రకటించారు. మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతంలో ఉండే దయారాంరాజారాం దేశ్‌పాండే అక్కడి రామమందిరంలో ప్రత్యేక పూజలు చేసేవారు. తమ కులదైవమైన శ్రీరామచంద్రుని కొలిచేందుకు అప్పట్లో కామోల్ గ్రామంలో ప్రత్యేక పూజామందిరం నిర్మించారు. మహారాష్ట్రలోని నాసిక్, పైటాన్, మదల్‌గావ్, ఔరంగాబాద్, దారూర్ ప్రాంతంలో పంచాంగాలు తయారు చేసే బ్రాహ్మణులు వేద పండితులను తీసుకువచ్చి ఉగాది పర్వదినం నుంచి 9 రోజులపాటు ఇక్కడి పూజామందిరంలో రామనవమి ఉత్సవాలు జరిపించేవారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో శాలిగ్రామ్ శిలతో చెక్కిన రామలక్ష్మణుల విగ్రహాలు ప్రతిష్ఠించారు. అక్కడి భక్తుడైన ఈయన కూడా నల్లని శాలిగ్రామ్ శిలతో సీతారామ, లక్ష్మణుల విగ్రహాలను చెక్కించారు. చుట్టుపక్కల ఆలయాల్లో పాలరాతితో చెక్కిన దేవతామూర్తులు ప్రతిష్టిస్తే ఇక్కడ మాత్రం నల్లని శాలిగ్రామ్ శిలతో చెక్కిన దేవతామూర్తులు నేటికి దర్శనమిస్తాయి. తొమ్మిది రోజుల ఉత్సవాలు జరిగాక నవమిరోజు కామోల్‌లో శ్రీరామచంద్రస్వామి జన్మదిన వేడుకలు నిర్వహిస్తారు. ఇదేరోజు భద్రాచలంలో శ్రీరామచంద్రస్వామి కల్యాణం జరుగుతుంది.

కొనసాగుతున్న పరంపర

వందల ఏళ్ల పరంపరను దయారాంరాజారాం దేశ్‌పాండే వంశీయులు కొనసాగిస్తూ వచ్చారు. 1978లో ఆయన మనుమడు నారాయణరావు దేశ్‌పాండే ఇక ఆలయ నిర్వహణతోపాటు ఉత్సవాలు జరిపించాలని గ్రామస్తులకు అప్పగించారు. అప్పటినుంచి ఆలయ కమిటీ ఏర్పాటు చేసి గ్రామస్తులు ఉత్సవాలు కొనసాగించారు. పురాతన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రతీరోజు పూజలు చేసి ప్రత్యేక మంగళహారతులు ఇస్తూ వచ్చారు.

ఆలయం ముస్తాబు

ఉగాది నుంచి ప్రారంభమైయ్యే శ్రీరామనవమి వేడుకలకు ఆలయం ముస్తాబు చేస్తున్నారు. మందిరంలో రంగులు వేసి ఆలయ ప్రాంగణంలో దేవతామూర్తుల చిత్రాలు వేస్తున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక బారీకేడ్లు ఏర్పాటు చేయనున్నారు. వేసవిలో భక్తులు సేద తీరేందుకు ప్రత్యేక టెంట్లు వేయనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. చివరిరోజు శ్రీరామ జన్మదిన వేడుకల అనంతరం కుస్తీపోటీలు నిర్వహించనున్నారు.

గ్రామస్తుల కృషితోనే..



రామ మందిర నిర్మాణం తోపాటు ఉత్సవాల నిర్వహణలో గ్రామస్తుల కృషి ఎంతగానో ఉంది. గతంలో దేశ్‌ముఖ్ వంశీయులు ఉత్సవాలను జరిపించేవారు. ప్రస్తుతం గ్రామస్తులు ఎంతో వైభవంగా వేడుకలు నిర్వహిస్తున్నారు.

– గంగారెడ్డి, కామోల్

'జనజాతర'కు తరలిన నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్/ఖానాపూర్/కడెం/భైంసా/లక్ష్మణచాంద: హైదరాబాద్‌లోని తుక్కుగూడలో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభకు జిల్లా నుంచి నేతలు, కార్యకర్తలు వాహనాల్లో తరలివెళ్లారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు క్యాంపు కార్యాలయం నుంచి నాయకులు ర్యాలీగా బయల్దేరారు. ఖానాపూర్ నుంచి మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, నాయకులు బాసర నుంచి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యేలు బోస్లే నారాయణరావుపటేల్, విఠల్‌రెడ్డిల ఆధ్వర్యంలో వేలాది కార్యకర్తలు వెళ్లారు. లక్ష్మణచాంద నుంచి మండల అధ్యక్షుడు రాజేశ్వర్ ఆధ్వర్యంలో పలువురు బయల్దేరారు.



నిర్మల్‌చైన్‌గేట్: వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు



కడెం: వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు



భైంసా: వెళ్తున్న బాసర కాంగ్రెస్ నాయకులు

భూసార్ బీట్ తాత్కాలిక బంద్

భైంసాటౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో మూడురోజులపాటు భూసార్ బీట్ కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపేయనున్నట్లు రెండో శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారంతోపాటు సోమవారం అమావాస్య, మంగళవారం ఉగాది పండుగను పురస్కరించుకుని మూడురోజులు బీట్ బంద్ ఉంటుందని, రైతులు గమనించాలని కోరారు. బుధవారం నుంచి యథావిధిగా కొనుగోళ్లు ఉంటాయని పేర్కొన్నారు.

మోటారుకు మరమ్మతు

ఖానాపూర్: పట్టణంలోని ఐదోవార్డు పరిధిలో గల ఇంద్రానగర్‌లో మోటారుకు కౌన్సిలర్ పరిమి లత సురేష్ ఆధ్వర్యంలో శనివారం మరమ్మతు చేయించారు. కాలనీలోని మోటారు స్టార్టర్ కండెన్సర్ కాలిపోయింది. కౌన్సిలర్ స్పందించి మున్సిపల్ సిబ్బందితో మరమ్మతు చేయించారు. కాలనీవాసులకు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కౌన్సిలర్ పేర్కొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ను నమ్మే పరిస్థితి లేదు

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

భైంసాటౌన్: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను, పదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలను అన్నివిధాల మోసం చేసిన బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని బీజేపీ ఎమ్మెల్యే, ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి పాయల్ శంకర్ అన్నారు. పట్టణంలోని ఎస్‌ఎస్ కాటన్‌లో శనివారం నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పతనమైందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కూ అదే గతి పడుతుందన్నారు. మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఇందుకు రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ నాలుగునెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ పేరిట కాలయాపన చేస్తోందని విమర్శించారు. అలాగే ఎంపీ టికెట్ ఆశించిన భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబుకు నామినేటెడ్ పోస్ట్ ఇప్పించాలని కోరారు.

పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటా..

తనకు ఎంపీ టికెట్ రాకపోయినా పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తానని భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబు అన్నారు. కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ స్థానం కైవసం చేసుకునేలా కార్యకర్తలంతా కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అంజికుమార్ రెడ్డి, జిల్లా నాయకులు అయ్యన్నగారి భూమయ్య, పడిపెల్లి గంగాధర్, మండల అధ్యక్షులు, పదాధికారులు పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ వేడుకలు



భైంసారూరల్: దేగాంలో జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు సుష్మారెడ్డి



సోన్: న్యూవెల్మల్‌లో జెండా ఆవిష్కరిస్తున్న వైస్ ఎంపీపీ అంకుల్ నాగయ్య



కుభీర్ మండలం గోడాపూర్‌లో...

భైంసారూరల్/లక్ష్మణచాంద/ఖానాపూర్/తానూరు/కడెం/భైంసా/సోన్/మామడ/లోకేశ్వరం/కుభీర్/దిలావర్‌పూర్/దస్తురాబాద్: బీజేపీ ఆవిర్భావ వేడుకలను జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయాచోట్ల నాయకులు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. సోన్ మండలంలోని న్యూవెల్మల్, గంజాల్ గ్రామాల్లో ఆవిర్భావ వేడుకల్లో నాయకులు పాల్గొనగా, న్యూవెల్మల్‌లో పార్టీ జెండాను వైస్ ఎంపీపీ అంకుల్ నాగయ్య ఆవిష్కరించారు. ఖానాపూర్, కడెంలో టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, భైంసా మండల బీజేపీ మహిళ మోర్చా అధ్యక్షురాలు సిరం సుష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'భూమిని ఇప్పించండి'

లోకేశ్వరం: మండలంలోని నర్సింహానగర్‌తండాకు చెందిన జాదవ్ మోతిరాం కిషన్‌ల ఎకరంన్నర భూమిని స్థానిక నాయకుడు ఆక్రమించారని ఆ భూమిని తనకు అప్పగించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి నూతన్‌కుమార్ మాట్లాడుతూ జాదవ్ మోతిరాం కిషన్‌లకు గల తన భూమి 214 సర్వేనంబర్ గల 10 ఎకరాల భూమిలో నుంచి ఎకరంన్నర భూమిని క్రీడాప్రాంగణం, సీసీ రోడ్డు కోసం అక్రమంగా ఓ స్థానిక నాయకుడు లాక్కొని ఏర్పాటు చేశారు. తన భూమిని ఇప్పించాలని రైతు కోరాడు. ఆయన వెంట నాయకులు చందుల సాయికిరణ్ తదితరులు ఉన్నారు.

'రైతులకు బేడీలు వేసింది బీఆర్‌ఎస్సే'

ముధోల్: రైతులకు బేడీలు వేసి జైళ్లకు పంపిన చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీదని టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుదీక్ష అంటూ బీఆర్‌ఎస్ చేస్తున్న దీక్ష పార్లమెంట్ ఎన్నికల వరకు కార్యకర్తలు చేయిజారకుండా ఉండడానికే తప్ప, రైతుల కోసం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడువకముందే కరువు పేరుతో కేసీఆర్ పొలంబాటతో పొలిటికల్ డ్రామాకు తెరలేపారని ఆరోపించారు. రైతులకు ఏదైన సమస్య వస్తే అది అప్పటి కేసీఆర్ పాపపు పాలన వల్లనే అని అన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతు దీక్ష



రైతు దీక్షలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

ఖానాపూర్: రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం ఒకరోజు రైతు దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాన్సన్‌నాయక్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. రైతు రుణమాఫీ చేసి ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామునాయక్, రాజగంగన్న, కొప్పుల నరేశ్, గౌరికార్ రాజు, పుప్పాల గజేందర్, విక్రమ్‌నాయక్, బీసీ రాజన్న, రాజేశ్వర్ గౌడ్, కరిపె శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, శనిగారపు శ్రావణ్, కారింగుల సుమన్, కళావతి, భరత్, బుచ్చాగౌడ్, రంజిత్, దర్మరాజు, దివాకర్, అమంద శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులు పరిశీలన



రాచాపూర్‌లో కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్, పార్‌పెల్లి గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను డీఆర్‌డీవో విజయలక్ష్మి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల సంఖ్యను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏపీవో ప్రమీల, టీఏలు దినేష్, భీమ్, ఎఫ్ఏ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. కాగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాచాపూర్‌లో కూలీలు పని ప్రదేశంలో సేదతీరేందుకు టార్పాలిన్ కవర్‌తో నీడ సౌకర్యం ఏర్పాటు చేశారు. చల్లటి తాగునీటి వసతిని కల్పించారు. పంచాయతీ కార్యదర్శి హరిత ఉన్నారు.

ఆంజనేయ విగ్రహప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే

ముధోల్: మండలంలోని బోరిగాం గ్రామంలో శనివారం నిర్వహించిన ఆంజనేయ విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. బాసర జెడ్పీటీసీ వసంత రమేశ్, నాయకులు తాటివార్ రమేశ్ పాల్గొన్నారు.

రణదీవే ఆశయాలు కొనసాగిద్దాం



నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: కార్మిక ఉద్యమ నేత సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు కామ్రేడ్ బీటీ రణదీవే ఆశయాలు కొనసాగిద్దామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ పిలుపునిచ్చారు. రణదీవే 34వ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా నాయకుడు డి.పోశెట్టి, ఆశవర్కర్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు సుజాత, డివిజన్ కార్యదర్శి కమల, నిర్మల్ డివిజన్ నాయకులు, ముధోల్ డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు



మాట్లాడుతున్న శంకర్

మామడ: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఈవో దుర్గం శంకర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నీటి ఇబ్బందులు ఉన్న కాలనీలను గుర్తించి సమస్య పరిష్కరించాలన్నారు. ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, ఎంపీవో లింబాద్రి, ఈజీఎస్ ఏపీఓ శివాజీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించాలి

కుంటాల: గ్రామాల్లో తాగునీటి సమస్యపై దృష్టిసారించాలని ఎంపీడీవో అబ్దుల్ రహీం పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశం మాట్లాడారు. ఉపాధి కూలీలకు పని కల్పిస్తూనే వేసవి జాగ్రత్తలు వివరించాలని కోరారు. నర్సరీలో మొక్కలను బాధ్యతాయుతంగా సంరక్షించాలన్నారు. ఏపీవో గట్టుపల్లి నవీన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

ఖానాపూర్: ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీపీ మోహిద్, ఎంపీడీవో సునీత తెలిపారు. సమావేశాన్ని తిరిగి నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, నాయకులు నారాయణ, సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్ తదితరులు ఉన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి అనుబంధ గ్రామం బూరుగుపల్లి (కె) గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త జాదవ్ మోతిలాల్ పటేల్ తన తండ్రి హిమ్మత్‌రావు పటేల్ జ్ఞాపకార్థంగా శనివారం 100 మంది పేదలకు శనివారం రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. సయ్యద్ గోరేమియా, సునీల్ రెడ్డి, షేక్ వకీల్, సయ్యద్ కలీం పాల్గొన్నారు.

నాసిరకంగా సీసీ రోడ్లపనులు

ఖానాపూర్: మండలంలోని గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయినేజీల పనులు నాసిరకంగా జరిగాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్ఆర్ ఉపాలి అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, స్థానిక అధికారుల పర్యవేక్షణ లోపం వెరసి ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారన్నారు. కనీసం పనులు చేసిన చోట క్యూరింగ్ చేయకపోవడంతో పగుళ్లు తేలిందన్నారు. దీనిపై క్వాలిటీ సెల్ విజిలెన్స్ సెల్ ఆధ్వర్యంలో విచారణ చేయాలని, లేకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

సంక్షిప్తంగా

రేపు కాంగ్రెస్ బూత్‌లెవల్ ఏజెంట్ల సమావేశం

నిర్మల్‌చైన్‌గేట్: ఈ నెల 8న నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాల బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశం నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు శనివా రం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఏఐసీసీ ఎస్సీ సెల్ జాతీయ అధ్యక్షుడు కొప్పుల రాజు, ఉమ్మ డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, పీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశ్, ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నారాయణరావు పటేల్, ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్, చింతకుంట, రువ్వి, బ్రహ్మణ్‌గావ్, ఆష్టా, విఠోలి, కారేగాం గ్రామాల్లో శనివారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

రైతులపై బీజేపీ కపట ప్రేమ

ఖానాపూర్: రైతు సమస్యలపై బీజేపీ ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తోందని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్‌నాయక్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీ, పంజాబ్ రైతులు తమ సమస్యలపై రోడ్లపై నిరసన తెలిపితే రబ్బరుగుండ్లు, వాటర్ ట్యాంకర్లతో రైతుల ఆందోళనను అణిచివేశారని అన్నారు. ఇవన్నీ మరిచి రైతు సమస్యలపై సత్యాగ్రహ దీక్షలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలి

నిర్మల్‌టౌన్: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఆదివారం నిర్వహించే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ ఓ ప్రకటనలో కోరారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిరసన ఉంటుందని పేర్కొన్నారు. 33 జిల్లాల నుంచి కేజ్రీవాల్ కు మద్దతుగా ప్రజలు తరలిరానున్నారని తెలిపారు.

వేసవిలో జాగ్రత్తగా ఉండాలి

సారంగపూర్: వేసవిలో కూలీలు జాగ్రత్తగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి వేదవ్యాస్ అన్నారు. మండలంలోని ఆలూరు గ్రామంలో ఉపాధి కూలీలకు వడదెబ్బ, దాని లక్షణాలపై శనివారం అవగాహన కల్పించారు. అనంతరం కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.